క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ర్యాంకర్‌కు సన్మానం



విజేతను అభినందిస్తున్న అధ్యాపకులు

కర్నూలు కల్చరల్: రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ పీఈసీఈటీ)లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన చంద్రప్పగారి దేవిని ఘనంగా సన్మానించారు. కర్నూలు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి తృతీయ సంవత్సరం విద్యార్థిని చంద్రప్పగారి దేవిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడం గర్వకారణమన్నారు. వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, అధ్యాపకులు సత్యనారాయణ, పీడీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు కల్చరల్: నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, టౌన్ మోడల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన ఉచిత నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన లెక్చరర్ల మార్గదర్శకత్వంలో అద్భుతమైన విజయాలు సాధించవచ్చన్నారు. త్వరలో మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ప్రవేశపెడతామన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వరరెడ్డి, ప్రిన్సిపాళ్లు జి.లాలప్ప, సుంకన్న మాట్లాడారు. అధ్యాపకులు ప్రభుచరణ్, అతావూర్ రహమాన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కొందరు సబ్ రిజిస్ట్రార్లు ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేకున్నా అక్రమ రిజిస్ట్రేషన్లు చేసి భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ ఆరోపించారు. శుక్రవారం రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అక్రమంగా రిజిస్ట్రేషన్ అయిన 2401/2023, 2401/2023 డాక్యుమెంట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సబ్ రిజిస్ట్రార్ల వ్యవహారాలను చూడాల్సిన జిల్లా రిజిస్ట్రార్ కూడా విచారణ జరపకపోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, గౌతమ్, హుస్సేన్‌బాష, శివశంకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి



వీసీ ఎన్‌టీకే నాయక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్‌కు శుక్రవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థి సంఘాల నాయకులు, వర్సిటీ పరిధిలోని బీఈడీ, డిగ్రీ కళాశాలల యాజమాన్యాల నాయకులు వీసీని కలిసి బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వర్సిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని వైస్‌ఛాన్సలర్ కోరారు.









● నగరంలో జడివాన

అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి నగర ప్రజలు తడిసి ముద్దవుతున్నారు.వివిధ పనుల నిమిత్తం తప్పనిసరి పరిస్థితిలో బయటకు వచ్చి వారు గొడుగులు, రెయిన్ కోట్లు ధరించి తమ పనులు సాగించారు. జోరు వర్షం వల్ల వీధి వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. ప్రజలు ఇళ్లకు పరిమితం కావడంతో వ్యాపారాలు మందకొడిగా సాగాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

'ఆలూరు ఇన్‌చార్జ్‌గా వీరభద్రగౌడ్ వద్దు'

- జిల్లా టీడీపీ కార్యాలయంలో తెలుగు తమ్ముళ్ల నిరసన
- పార్టీ జిల్లా అధ్యక్షుడితో గంటసేపు వాగ్వివాదం



టీడీపీ జిల్లా కార్యాలయానికి తరలివస్తున్న ఆలూరు నియోజకవర్గ శ్రేణులు

కర్నూలు: ఆలూరు అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జ్‌గా వీరభద్రగౌడ్ వద్దంటూ ఆ పార్టీ జిల్లా కార్యాలయం వద్ద తెలుగు తమ్ముళ్లు నిరసనకు దిగారు. 2019 నుంచి 2024 వరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌గా కోట్ల సుజాతమ్మ వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆమె టిక్కెట్ కూడా ఆశించారు. అయితే అనూహ్య పరిణామాల నేపథ్యంలో అధిష్టానం వీరభద్ర గౌడ్‌ను అభ్యర్థిగా ప్రకటించగా ఆయన ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. అనంతరం నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు మూడు గ్రూపులుగా విడిపోయారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు వీరభద్రగౌడ్‌కు కాకుండా చిప్పగిరి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మీనాక్షి నాయుడుకు ఇవ్వాలంటూ శుక్రవారం నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో పవన్ గ్యాస్ యజమాని వెంకటేశ్వర చౌదరి, చిప్పగిరి మాజీ సర్పంచ్ రాధమ్మ, ఆలూరు మండల టీడీపీ కన్వీనర్ అశోక్‌యాదవ్, హొళగుండ మండలం చిన్నహ్యాట గ్రామానికి చెందిన శేషగిరి, మరకట్టు గ్రామ సర్పంచ్ యల్లప్ప, హాలహర్వి ఉమాపతినాయుడు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కర్నూలులోని టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. కర్నూలు పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డితో సుమారు గంట సేపు వాదనకు దిగారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ వీరభద్రగౌడును నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఒప్పుకునేది లేదని, ఆయన్ను తప్పించి మీనాక్షి నాయుడును నియమించాలని నిరసనకు దిగడంతో జిల్లా అధ్యక్షుడు స్పందించారు. మీ కోరికను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో పార్టీ శ్రేణులు శాంతించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాలంటూ వైకుంఠం శివప్రసాద్ కూడా కోరడంతో కొద్దిసేపు కార్యాలయంలో గందరగోళ పరిస్థితి నెలకొంది. తెలుగు తమ్ముళ్లు ఒకరికొకరు గట్టిగా వాదించుకోవడంతో ఒక దశలో జిల్లా అధ్యక్షుడు అసహనం వ్యక్తం చేశారు. సమస్య తీవ్రతను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో తెలుగు తమ్ముళ్లు నిరసనను ఉపసంహరించుకుని వెళ్లిపోయారు.

మహిళా మార్ట్‌కు శంకుస్థాపన



మహిళా మార్టు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు(టౌన్): టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఇళ్లను పంపిణీ చేస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం నగర శివారులోని జగన్నాథగట్టు వద్ద ఉన్న నగరపాలక సంస్థ (పీఎంఏవై) టిడ్కో కాలనీలో రూ.1.38 కోట్లతో మహిళా మార్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చివరి దశలో ఉన్న టిడ్కో గృహాలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. మహిళా మార్టు ద్వారా సరసమైన ధరలకే నిత్యావసర సరుకులు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు నగరానికే తలమానికంగా ఈ గృహాలను ఏర్పాటు చేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ.. టిడ్కో గృహాల్లో 50 కుటుంబాలు నివాసం ఉన్నాయని వారికి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నీటి సౌకర్యం కల్పిచామన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ టిడ్కో గృహాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. అంతకుముందు వారు టిడ్కో గృహాలను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఏపీ టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, డీఈలు హరికృష్ణ, రవికుమార్ గుప్త, పవన్‌కుమార్ ఏఈలు కొశియా, నాయక్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

కర్నూలు: ఎన్నికల సమయంలో జిల్లా ప్రజలు, రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని మంత్రి టీజీ భరత్ అన్నారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు యాదవ్, ఎమ్మెల్యేలు గౌరుచరిత, కేఈ శ్యాం బాబు, దస్తగిరితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. తుంగభద్ర, కేసీ కెనాల్ ఆయకట్టు రైతులకు న్యాయం చేస్తామన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి



మాట్లాడుతున్న టౌన్ ప్లానింగ్ డీసీపీ సంధ్యారాణి

కర్నూలు (టౌన్): నగరంలో చేపడుతున్న రహదారి విస్తరణ పనులకు సహకరించాలని నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్యారాణి కోరారు. ఆమె శుక్రవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో విస్తరణలో షాపులు కోల్పోయే యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ ప్రకారం నగరంలోని పాతబస్టాండ్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి పెద్ద మార్కెట్ లక్ష్మీ నరసింహ దేవాలయం వరకు ఉన్న రహదారిని 60 అడుగుల వెడల్పు చేస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్లాన్‌కు అనుమతి వచ్చిందని, దీనిపై ఆ ప్రాంతాల్లోని వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. మొత్తం 89 మంది బాధితులకు వివరించినట్లు చెప్పారు. రద్దీగా ఉన్న ఈ ప్రాంతంలో రహదారి విస్తరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని, త్వరలోనే పనులను ప్రారంభిస్తామని చెప్పారు. ఏసీపీలు రంగస్వామి, సూపర్‌వైజర్లు శబరీష్, మంజులమ్మ, సూపరింటెండెంట్ సుబ్బన్న, భార్గవ్ పాల్గొన్నారు.

నెలాఖరులోపు పనులు పూర్తి చేయండి



పనులపై డీఈఈకి సూచనలు చేస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): వచ్చే నెలలో ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రారంభించనుందని, నగరంలో అన్న క్యాంటీన్ల భవనాల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో, కల్లూరు ఎస్టేట్‌లోని సెట్కూర్ కార్యాలయం సమీపంలో, ఉల్చాల రోడ్డులోని వై.జంక్షన్ వద్ద ఉన్న పరిమళనగర్, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, పాతబస్టాండ్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఈ షాకీర్, డీఈ రవిప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): కల్లూరు మండలం చిన్నటేకూరు, మిలిటరీ కాలనీ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్, కొత్త లైన్ పనులు జరుగుతున్నందున శనివారం వివిధ గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.సుబ్బన్న తెలిపారు. చిన్నటేకూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని చిన్నటేకూరు, తడకనపల్లి, బస్తిపాడు, వామసముద్రం, బొల్లవరం, పుసులూరు, రేమడూరు, మిలటరీ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని గార్గేయపురం, మిలటరీకాలనీ, నూతనపల్లి, నందనపల్లి, వెంకాయపల్లి, దిగువపాడు, పూడూరు గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వెల్లడించారు. వ్యవసాయానికి త్రీఫేజ్ సప్లయ్ ఉదయం 5 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

23, 24 తేదీల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు(సెంట్రల్): స్థానిక సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 23వ తేదీన, లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మండపంలో 24వ తేదీన జిల్లా జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, ఏ.శేఖర్, ఎన్.లెనిన్‌బాబు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో జిల్లా సమగ్రాభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించనున్నట్లు ఆయన వివరించారు.

విద్యార్థులు మార్కులకే పరిమితం కావొద్దు

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు కేవలం మార్కులు, ర్యాంకులకే పరిమితం కాకుండా దేశానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ అన్నారు. కర్నూలు నగరంలోని భాష్యం పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు విద్యార్థులను మార్కులు, ర్యాంకులకే పరిమితం చేస్తున్నారని, అలాగాకుండా వారిని మంచి పౌరులుగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. ప్రతిఒక్కరూ తమ పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ఆయా రంగాల్లో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రిన్సిపాల్ రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఇండోనేషియన్ సెంటర్‌తో విజ్ఞానం

కర్నూలు కల్చరల్: అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఇండోనేషియన్ సెంటర్ టెక్ టెక్నాలజికల్ మీట్ అప్ సమావేశాన్ని జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా హైదరాబాదు ఐపీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, ఇండోనేషియన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ భీమా లింగేశ్వర్ రెడ్డి, ఐఎస్ఏటీ ఇన్నోవేషన్ మేనేజ్‌మెంట్ సీనియర్ ఆఫీసర్ స్రవంతి వేదుల హాజరై అవగాహన కల్పించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన 35 కాలేజీల విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఆలోచనలను ఈ సభలో ఇండోనేషియన్ సెంటర్ అతిథులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు, అసోసియేట్ డీన్, ఇన్నోవేషన్స్ డాక్టర్ హెచ్ఎస్ అఫ్జల్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గర్భిణులకు సూచనలు చేస్తున్న ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత సూచించారు. శుక్రవారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు విజృంభిస్తాయని, డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. అలాగే కలుషిత నీటి వల్ల కామెర్లు, టైఫాయిడ్, అతిసారం, కలరా, విషజ్వరాలు, దగ్గు, జలుబు వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని వివరించారు. కలుషిత ఆహారం తీసుకోవద్దని, భోజనం చేసే ముందు కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. దోమలను అదుపు చేసే చర్యలు తీసుకోవడం, పరిసరాల శుభ్రత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్యాధికారి డాక్టర్ మంజూష మాట్లాడుతూ కుటుంబసభ్యుల్లో ఎవ్వరికైనా నీళ్ల విరేచనాలు, వాంతులు వంటి అనారోగ్య సమస్యలు సంభవిస్తే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని, జింక్ మాత్రలను 14 రోజులపాటు తప్పనిసరిగా వాడాలని సూచించారు. గర్భిణికి సుఖప్రసవం అవ్వాలంటే హిమోగ్లోబిన్ శాతం అధికంగా ఉండాలని, రక్తహీనత నివారణకు ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలన్నారు. గర్భిణులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే వారికి జన్మించే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పీహెచ్ఎన్ నిర్మలాదేవి, సామాజిక ఆరోగ్య అధికారి నిరంజన్, ప్రేమలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ సూచించారు. శుక్రవారం ఫ్రైడే –డ్రైడే కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ కార్యదర్శులు, మలేరియా సిబ్బంది నగరంలోని కాలనీలలో పర్యటించారు. నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయించారు. కాల్వల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలు, కూలర్లు, బాటిల్స్, తొట్టెలలో రోజుల తరబడి నీరు నిల్వ ఉండడం వల్ల అనేక సమస్యలు వస్తాయన్నారు. ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్య లోపం, నీటి సరఫరా, ఇతరత్రా సమస్యలు ఉంటే 74229 92299 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

సీనియర్ న్యాయవాది మృతికి సంతాపం

కర్నూలు (లీగల్): సీనియర్ న్యాయవాది కె.సత్యనారాయణరావు (94) మృతి పట్ల కర్నూలు జిల్లా న్యాయవాదులు, న్యాయమూర్తులు సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం జిల్లా కోర్టు హాల్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ సభ్యులు రవిగువేరా, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ.. సత్యనారాయణరావు 50 సంవత్సరాల పాటు న్యాయవాదిగా సివిల్ కేసుల్లో మంచి పేరు గడించారని తెలిపారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయమూర్తులు పాల్గొని రెండు నిమిషాలు మౌనం పాటించి కోర్టు విధులను గంట తర్వాత ప్రారంభించారు.